
ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 31.5
కనిష్ఠం 24.4
***
ANDHRAJYOTHY



నల్లగొండ
5
బుధవారం 14 ఆగస్టు 2024

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	589.50 (310.2522)	68,453	47,347
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	641.92 (3.67)	793,39	512.82
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	170.40 (39.66)	39,669	2,400

ప్రాజెక్టుల నీటిమట్టం

చికెన్ ధరలు | లైవ్ : రూ.105 | డ్రెస్ : రూ.152 | స్కిన్‌లెస్ : రూ.172



నిండుకుండలా సాగర్ జలాశయం

» 589.50 అడుగుల వద్ద సాగర్ నీటి మట్టం » గరిష్ఠ మట్టానికి అరడుగు తక్కువగా నీటినిల్వ

నాగార్జునసాగర్, మేళ్లచెర్వు, కేతేపల్లి, ఆగస్టు 13: నాగార్జునసాగర్ ప్రాజెక్టు నీటినిల్వతో నిండుకుండను తలపిస్తోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు (312.5050 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 589.50అడుగులు (310.2522 టీఎంసీలు)ఉంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు (215.8070 టీఎంసీలు) కాగా ఆ ప్రాజెక్టుకు 77,598 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండటంతో మంగళవారం సాయంత్రానికి 881అడుగులుగా (193.4090 టీఎంసీలు) ఉంది. శ్రీశైలం కుడి, ఎడమ గట్టు జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 68,453 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. దీంతో సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం 589.50 అడులకు చేరుకుంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 7,086 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 8,629 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,232 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరద కాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 47,347 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తుండగా ఎగువ నుంచి 68,453 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతుంది.


సాగర్ ప్రధాన డ్యాం సమీపంలో మొసలి

సాగర్ ప్రధాన డ్యాం సమీపంలో మంగళవారం మధ్యాహ్నం మొసలి కనిపించింది. ప్రధాన డ్యాం వద్ద కంట్రోల్ రూం లో ఉన్న సీసీ టీవీలో టన్నెల్ వద్ద మొసలి కదలికలను గమనించారు. వారం రోజులుగా ఎగువ నుంచి భారీ వరదలు రావడంతో మొసళ్లు వచ్చి ఉంటాయని అధికారులు తెలిపారు. పర్యాటకులు ఎవరూ నదిలోకి దిగవద్దని, మత్స్యకారులు జాగ్రత్తగా ఉండాలని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

పులిచింతల ప్రాజెక్టులో రెండు యూనిట్ల ద్వారా విద్యుదుత్పత్తి

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు వద్ద జల విద్యుత్ కేంద్రం నుంచి 2,400 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ 40 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 175అడుగులు (45.77టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 170.40 అడుగులుగా (39.66 టీఎంసీలు) ఉంది. ప్రాజెక్టుకు ఎగువ నుంచి 39,669 క్యూసెక్కుల వరద వస్తుండగా, జలవిద్యుత్ కేంద్రం ద్వారా 2,400 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో



నల్లగొండ జిల్లా కేతేపల్లి సమీపంలోని మూసీ ప్రాజెక్టుకు ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో నిలకడగా కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రానికి 793.39 క్యూసెక్కుల వరద వస్తోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 645 అడుగులు (4.46 టీఎంసీలు) కాగా మంగళవారం సాయంత్రానికి 641.92 అడుగులు (3.67 టీఎంసీ) ఉంది. మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం కుడి, ఎడమ కాల్వల కు 256.41 క్యూసెక్కుల చొప్పున నీటిని విడుదల చేస్తున్నారు.

గంజాయిపై ఉక్కుపాదం

» 565 కిలోల గంజాయి దహనం
» ఎస్పీ శరత్‌చంద్ర పవార్



గుమ్మళ్లబావి పోలీస్ ఫైరింగ్ రేంజ్ వద్ద గంజాయిని దహనం చేస్తున్న ఎస్పీ

నార్కట్‌పల్లి, ఆగస్టు 13: యువత భవిషత్‌ను, విలువైన జీవితాన్ని నాశనానికి కారణమవుతున్న మాదక ద్రవ్యాలు, గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన 43 కేసుల్లో స్వాధీనం చేసుకొని కోర్టు ఉత్తర్వుల మేరకు సీజ్ చేసిన సుమారు రూ.1.40కోట్ల విలువైన 565 కిలోల గంజాయిని జిల్లా డ్రగ్స్ డిస్పోజబుల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నార్కట్‌పల్లి మండల పరిధిలోని గుమ్మళ్లబావి వద్ద ఉన్న 12వ బెటాలియన్ పోలీస్ ఫైరింగ్ రేంజ్‌లో దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ, గంజాయి రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా మార్చడమే ధ్యేయంగా పోలీస్‌శాఖ పనిచేస్తోందన్నారు. అత్యధికంగా విజయపురి పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు కేసుల్లో 323 కిలోల గంజాయి పట్టుబడిందన్నారు. కేతేపల్లి పీఎస్ పరిధిలో 98కిలోలు, మొత్తం కలిపి సీజ్ చేసిన 565 కిలోల గంజాయిని నిర్వీర్యం చేశామన్నారు. జిల్లా అంతటా ప్రత్యేక నిఘా పెట్టి గంజాయి, మాదక ద్రవ్యాల నిరోధానికి కృషి చేస్తున్నామన్నారు. సరఫరా, రవాణా చేసే వారితో పాటు వీటిని వినియోగించే వారిని గుర్తించేందుకు చేపట్టిన మిషన్ పరివర్తన కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తోందన్నారు. గంజాయి వినియోగించిన సుమారు 140 మందిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. వారం వ్యవధిలో తిరిగి వారికి పరీక్షలు నిర్వహించగా గంజాయి సేవించలేదని నిర్ధారించామని చెప్పారు. నిషేధిత మత్తు పదార్థాలకు యువత బానిస కావొద్దని సూచించారు. పిల్లల ప్రవర్తన విషయంలో తల్లిదండ్రులు కూడా దృష్టిపెట్టాలని సూచించారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ కళాశాలలు, పాఠశాలల్లో ఇప్పటికే తమ అధికారుల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి రవాణా లేదా మాదక ద్రవ్యాలపై ఎటువంటి సమాచారం ఉన్నా 8712670266 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములునాయక్, డీసీఆర్‌బీ డీఎస్పీ సైదా, రవికుమార్, రాఘవరావు, నార్కట్‌పల్లి సీఐ, ఎస్ఐ నాగరాజు, క్రాంతికుమార్, కొండల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగుచేస్తే సంక్షేమ పథకాలు కట్

జిల్లా వ్యవసాయాధికారి శ్రావణ్‌కుమార్



నార్కట్‌పల్లి రైతువేదికలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రవణ్‌కుమార్

నార్కట్‌పల్లి, ఆగస్టు 13: రైతులు వారి పంటపొలాల్లో గంజాయి సాగుచేస్తే భవిష్యత్‌లో ప్రభుత్వ పథకాలు వర్తించవని జిల్లా వ్యవసాయాధికారి పి.శ్రవణ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక రైతు వేదిక నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. పంట పొలాల్లో ఎవరైనా గంజాయి సాగు చేస్తున్నట్లు ఏఈవోలు గుర్తిస్తే ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గంజాయిని సాగుచేసినట్లు తేలితే రైతులకు భవిష్యత్‌లో ప్రభుత్వం నుంచి ఎలాంటి సంక్షేమ పథకాలు అందవని, రైతు బీమా, రైతుబంధు, రుణమాఫీ లాంటివి వర్తించవన్నారు. కలెక్టర్ ఆదేశానుసారం ప్రతీ మంగళవారం రైతు నేస్తం అనంతరం సమీక్ష నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ క్రాంతికుమార్, ఏఎస్ఐ నర్సిరెడ్డి, ఏడీఏ రామారావునాయక్, వీరప్ప, ఏవో గిరిప్రసాద్, ఏఈవోలు, తదితరులు పాల్గొన్నారు.

రాజధానికి నీటి సరఫరా భారం

ఏఎమ్మార్పీపైనే



సుంకిశాల ఇన్‌టేక్‌వెల్ ప్రాజెక్టు పనులు గడువుకు మించి జాప్యమవుతుండడంతో హైదరాబాద్ మహానగరానికి మరో మూడేళ్ల పాటు ఏఎమ్మార్పీ (ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు)నుంచే తాగునీటిని అందించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సుంకిశాల ప్రాజెక్టు పనుల్లో ప్రమాదం జరిగి, రిటైనింగ్ వాల్ కూలడంతో ఈ పనులు జాప్యం కానుండగా, రాజధానికి నీటిసరఫరా భారం ఏఎమ్మార్పీపైనే కొనసాగనుంది.

– (ఆంధ్రజ్యోతి ప్రతినిధి,నల్లగొండ)

» మరో మూడేళ్లు ఇదే పరిస్థితి » ప్రమాదంతో సుంకిశాల పనుల్లో జాప్యం » అప్పటి వరకు ఏఎమ్మార్పీ నుంచే నీటి సరఫరా » రాజధానికి తాగునీటి సరఫరాతో పూర్తి ఆయకట్టుకు అందని సాగునీరు

ఏఎమ్మార్పీపై హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసే భారం తగ్గించడంతో పాటు, వేసవిలో నాగార్జునసాగర్ జలాశయంలో డెడ్‌స్టోరేజీకి నీటిమట్టం పడిపోయినప్పుడు నీటి సరఫరాలో ఇబ్బందిలేకుండా ఉండాలనే లక్ష్యంతో చేపట్టిన సుంకిశాల ప్రాజెక్టు పనుల్లో ప్రమాదం జరిగి, రిటైనింగ్ వాల్ కూలింది. ఈ సంఘటన మొత్తం ప్రాజెక్టు పనుల్లో జాప్యానికి కారణమైంది. వాస్తవానికి ప్రభుత్వ అంచనా ప్రకారం వచ్చే వేసవి నాటికి కనీసం ఒక్క టన్నెల్ ద్వారానైనా నీటిని అందించేందుకు సిద్ధం చేయాలన్నది లక్ష్యం. కాగా, ఆ దిశగా పనులు కొనసాగిస్తున్న క్రమంలో ప్రమాదం జరగడం, దీనిపై రాజకీయం నెలకొనడంతో ప్రాజెక్టు పనుల్లో అనివార్యంగా జాప్యం తప్పని పరిస్థితి ఏర్పడింది.

2026 వరకు హైదరాబాద్‌కు ఏఎమ్మార్పీ నుంచే నీరు

సుంకిశాల ప్రాజెక్టు కాంట్రాక్ట్ ఒప్పందం ప్రకారం 2025 మేనాటికి అందుబాటులోకి రావాల్సి ఉంది. కాంట్రాక్ట్ సంస్థ పేర్కొంటున్న ప్రకారం ఇప్పటివరకు ఇన్‌టేక్‌వెల్ పనులు 60 శాతం, పంపింగ్ మెయిన్ పనులు 70శాతం, ఎలక్ట్రోమెకానికల్ పనులు 40శాతం మేర పూర్తయ్యాయి. ప్రమాదం జరగడంతో సంపు పనులు మళ్లీ మొదటికొచ్చాయి. దీంతో ఈ పనులన్నీ పూర్తవ్వాలంటే మరో ఏడాది అదనంగా సమయం పడుతుందని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. అప్పటి వరకు ప్రస్తుతం కొనసాగుతున్నట్లుగానే ఏఎమ్మార్పీ నుంచే హైదరాబాద్‌కు నీటిని అందించాల్సి ఉంటుంది. ఏఎమ్మార్పీలో భాగమైన ఏకేబీఆర్ నుంచి ప్రస్తుతం రోజుకు 525 క్యూసెక్కుల చొప్పున మూడు పైప్‌లైన్ల ద్వారా హైదరాబాద్‌కు నీటిని అందిస్తున్నారు. వేసవిలో సాగర్‌లో నీటిమట్టం తగ్గితే ప్రత్యేకంగా 10 భారీ మోటర్లు ఏర్పాటు చేసి నీటిని తోడి పంపింగ్ చేయాలి. 2021లో, 2024లో రెండు పర్యాయాలు ఈ పరిస్థితి కొనసాగింది. సుమారు 16ఏళ్ల నుంచి హైదరాబాద్‌కు సాగర్‌నీటిని అందిస్తున్న నేపథ్యంలో నల్లగొండ జిల్లాలోని ఏఎమ్మార్పీ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీటిని అందించలేకపోయారు. సుంకిశాల అందుబాటులోకి వస్తే ఏఎమ్మార్పీకి ఆ భారం తప్పుతుందని భావించినా, అనూహ్యంగా ప్రాజెక్టులో ప్రమాదంతో వివాదంలో చిక్కుకోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. ఇంకోవైపు ఏఎమ్మార్పీ, సుంకిశాల వంటి ఎత్తిపోతల పథకాలతో అవసరం లేకుండా గ్రావిటీతో నల్లగొండ జిల్లాకు నీటిని అందించే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ నిర్మాణంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించినా,ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చేందుకు మరో మూడేళ్లు పట్టనుంది. మొత్తంగా నల్లగొండ జిల్లాలో దాదాపు 2.60లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ మహా నగరానికి తాగునీటిని అందించాల్సిన అనివార్య పరిస్థితి ఏఎమ్మార్పీకి మరో మూడేళ్ల పాటు తప్పదు. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టు నిర్వహణలో ఇబ్బందుల్లేకుండా చూడాలనే సూచనలు సర్వత్రా వస్తున్నాయి.

కొనసాగుతున్న సివిల్ పనులు

సుంకిశాల ఇన్‌టేక్‌వెల్ ప్రాజెక్టు వద్ద సంపు పనుల్లో బ్రేక్ పడినా, ఇతర పంపుహౌస్ నిర్మాణపనులు, పంప్‌హౌస్ స్ట్రక్చర్ పనులు, పంపింగ్ మెయిన్ పనులు, సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. ఉత్తర భారతదేశానికి చెందిన దాదాపు 300 మందికి పైగా కార్మికులు, మెగా కంపెనీకి చెందిన ఇంజనీర్లు, నాన్‌టెక్నికల్ సిబ్బంది ఇక్కడ పనులు నిర్వహిస్తున్నారు. ఈ పనులు వేగంగా సాగినా, కీలకమైన సంపు పనులు పూర్తయితే తప్ప ప్రాజెక్టు కొలిక్కిరాని పరిస్థితి ఉంది.



పనులు సాగాలంటే సాగర్‌లో

నీటిమట్టం తగ్గాల్సిందే..

నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు ఆనుకొని సుంకిశాల వద్ద ఇన్‌టేక్‌వెల్ నిర్మిస్తున్నారు. ఇక్కడ సంపు, మూడు టన్నెళ్ల నిర్మాణాలతో పాటు, పంపుహౌస్, పంపుహౌస్ సూపర్ స్ట్రక్చర్ నిర్మిస్తున్నారు. అందులో టన్నెళ్లు, వాటిపై సైడ్‌వాల్స్ నిర్మిస్తున్నారు. మొత్తం రిజర్వాయర్ లెవల్‌కు సమాంతరంగా 180 మీటర్ల ఎత్తు, ఆపైన సంపుఫ్లోర్ లెవల్‌కు మరో 137మీటర్ల ఎత్తుకు నిర్మాణాలు జరగాల్సి ఉంది. ప్రస్తుతం ప్రమాదంలో సైడ్‌వాల్ కూలిపోవడంతో ఆ గోడను పూర్తిగా దిగువనుంచి మళ్లీ నిర్మించాల్సి ఉంటుంది. ఆ ఒక్క గోడ నిర్మాణమే గాక, ప్రమాదంలో టన్నెల్‌కు రిజర్వాయర్ వైపున ఉన్న గేటు తెరుచుకోవడంతో సంపులోకి నీరు వచ్చి చేరుతోంది. ఈ నీటిని తీయాలంటే సాగర్ రిజర్వాయర్‌లో ఈ గేటు లెవల్‌కంటే దిగువకు నీటిమట్టం పడిపోవాలి. అంటే దాదాపు డెడ్‌స్టోరేజీ పరిస్థితి ఏర్పడాలి. నిర్మాణ సంస్థ ప్రతినిధులు రెండు నెలల్లో ఈ సంపులో కూలిన సైడ్‌వాల్ పనులు ప్రారంభిస్తామని చెబుతున్నా, వాస్తవానికి రిజర్వాయర్‌లో నీరు తగ్గాలంటే కనీసం ఫిబ్రవరి వరకు ఆగాలి. డెడ్‌స్టోరేజీకి నీరు పడిపోకపోయినా, నదిలో టన్నెల్స్ వైపునీరు రాకుండా మళ్లించే నిర్మాణం చేపట్టాలన్నా కనీస నీటిమట్టానికి చేరువవ్వాలి. అది జరగాలన్నా కనీసం ఫిబ్రవరి వరకు వేచి ఉండకతప్పదని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఈ ప్రమాదంపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే అంశంకూడా సంపు పనుల వేగవంతాన్ని ప్రభావితం చేస్తుందని, మొత్తంగా ఈ వివాదమంతా ముగిసి, పనులు ముందుకు సాగేందుకు వేసవి వరకు వేచి ఉండక తప్పని పరిస్థితి క్షేత్రస్థాయిలో కనిపిస్తోంది.

వైద్య చికిత్సలపై దృష్టి సారించాలి

కలెక్టర్ నారాయణరెడ్డి



మునుగోడు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నల్లగొండ టౌన్, ఆగస్టు 13: విద్య, వైద్య, ఆరోగ్య సంక్షేమంలో భాగంగా నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంపిక చేసిన మోడల్ ఆస్పత్రులలో ఈనెల 15 నుంచి ప్రసవాలతోపాటు, చిన్నపిల్లల వైద్య చికిత్సలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెల 15 నుంచి వారం రోజులపాటు అన్ని మునిసిపాలిటీలు, గ్రామాల్లో జ్వర సర్వే నిర్వహించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి ఎవరైనా జ్వరంతో బాధపడితే తక్షణమే చికిత్స అందించడమేగాక, ప్రతీ రోజు వారి వివరాలు తెలుసుకుని సమర్పించాలన్నారు. ఎంపిక చేసిన దేవరకొండ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్, నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రిలో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు మోడల్ ఆస్పత్రులుగా ఎంపికయ్యాయన్నారు. ప్రధానంగా 24 గంటలు గర్భిణులకు, చిన్న పిల్లలకు వైద్య చికిత్సలు అందించడంపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఎలాంటి తప్పులకు ఆస్కారం ఇవ్వకుండా స్వాతంత్ర్య దినోత్సవం నిర్వహించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, డీఎంహెచ్‌వో శ్రీనివాస్, డీసీహెచ్ఎస్ మాతృనాయక్, డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

మునుగోడు: మునుగోడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎస్సీ హాస్టల్, ఉన్నత పాఠశాలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీలో మందుల నిల్వలు, రికార్డులతో పాటు హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. వైద్య సేవలపై రోగులను, పాఠశాలలో మెనూపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న ఎస్సీ హాస్టల్ భవనంలో విద్యార్థుల సంఖ్యకు అవసరమైన గదులకు తాత్కాలిక మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఉద్దేశాలకు కట్టుబడి లక్ష్యాలను పూర్తి చేయాలని, అలసత్వం చూపితే బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో శ్రీనివాస్, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో పూజ, నాయబ్ తహసీల్దార్ నరేష్, వైద్యాధికారులు డాక్టర్ నర్మద, డాక్టర్ మాధూరి, హెచ్ఎం కె.రవీందర్, ఎంపీవో స్వరూపరాణి, తదితరులు ఉన్నారు.

రికార్డుల్లో ఒకలా.. వాస్తవంలో మరోలా

» హాస్టళ్లలో ఉండేది సగం మందే » ఏసీబీ తనిఖీల్లో బట్టబయలు



తిప్పర్తి ఎస్సీ బాలికల వసతిగృహంలోని మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న ఏసీబీ నల్లగొండ డీఎస్పీ జగదీష్‌చంద్ర, అధికారులు

తిప్పర్తి, ఆగస్టు 13: రికార్డుల్లో ఉన్న విద్యార్థుల్లో సగం మంది మాత్రమే హాస్టల్‌లో ఉంటున్నారని ఏసీబీ నల్లగొండ డీఎస్పీ జగదీష్‌చంద్ర అన్నారు. రాష్ట్ర ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన వసతి గృహాల ఆకస్మిక తనిఖీల్లో భాగంగా మంగళవారం తిప్పర్తిలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని ఆయన అధికారుల బృందంతో కలిసి పరిశీలించారు. ఉదయం 6 గంటలకే హాస్టల్ వద్దకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహానికి వచ్చేప్పటికి హాస్టల్‌లో ఒక వాచ్ మహిళ మాత్రమే ఉన్నారన్నారు. హాస్టల్ వార్డెన్ రాధాకుమారికి సమాచారం అందించి వారు వచ్చిన తర్వాత హాస్టల్‌లో తనిఖీ చేపట్టామన్నారు. హాస్టల్ మొత్తంలో విద్యార్థుల సంఖ్య 52 మంది ఉన్నట్లుగా నమోదైంది కానీ, ఉంటున్నది 23మంది విద్యార్థినులు మాత్రమే అని తేలిందన్నారు. అదేవిధంగా అదే గ్రామంలో ఇంటి వద్ద ఉంటున్న విద్యార్థినులు కూడా హాస్టల్‌లో ఉంటున్నట్లు రికార్డుల్లో చూపిస్తున్నారన్నారు. అదేవిధంగా హాస్టల్ వసతులను ఉపయోగించుకుంటున్నారని తెలిపారు. హాస్టల్‌కు సంబంధించిన వసతులను పరిశీలించామన్నారు. వాటర్‌ట్యాంక్ అపరిశుభ్రంగా ఉందని, మరుగుదొడ్లు కూడా సరిపడాలేవన్నారు. వంట గదిలో గదులను శుభ్రం చేయడానికి ఉపయోగించే లిక్విడ్‌లను, బ్లీచింగ్ పౌడర్లను ఉంచారన్నారు. దీంతో విద్యార్థులు తినే ఆహారంలో ఇబ్బంది జరిగే ప్రమాదం ఉందన్నారు. హాస్టల్ వద్ద వారి సమయం ప్రకారం హాజరైన వారికి అందించే బ్రేక్‌ఫాస్ట్, జావ వంటివి అందించాల్సి ఉండగా అలా జరగడం లేదన్నారు. అదేవిధంగా బాలికలకు ప్రతి నెలా ఇచ్చే కాస్మోటిక్స్‌కి సంబంధించి రెండు నెలలుగా ఎలాంటి రికార్డులు నమోదు చేయడంలేదన్నారు. దీంతో అధికారులు తనిఖీ చేసినప్పుడు వివరాలు తెలియకుండా ఉందన్నారు. గత నెలలో మిర్యాలగూడ ఏఎస్‌డబ్ల్యువో వెంకటేశ్వర్లు నామమాత్రపు తనిఖీ చేశారన్నారు. ఆయన ఎలాంటి నిబంధనలు చెప్పకుండా వెళ్లడంతో భయం లేకుండా పోయిందన్నారు. ఇక్కడ ఉన్న పరిస్థితులపై ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామన్నారు. అదేవిధంగా నల్లగొండ జిల్లాలో ఉన్న మిగతా హాస్టళ్లలో ఎక్కడా వసతులు సరైన విధంగా లేకపోయినా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి చర్యలకు సంబంధించిన రిపోర్టులను పంపిస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో ఆయన వెంట ఏసీబీ సీఐలు రామారావు, వెంకట్‌రావు, రంగారెడ్డి, సీఐ సునీత, లీగల్ మెట్రాలజీ సీఐ వెంకటేశ్వర్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు. విలేకరుల సమావేశం అనంతరం స్థానిక మోడల్ స్కూల్‌ను ఏసీబీ బృందం పరిశీలించింది. అయితే గుర్తించిన వివరాలేవీ వెల్లడించలేదు.

తిరంగా ర్యాలీ



హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా నల్లగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

•8లో..

భూ సర్వేకు రైతులు సహకరించాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాస్



నెల్లికల్లులో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 13: రెవెన్యూ పైలట్ ప్రాజెక్టులో భాగంగా మండలంలో నిర్వహిస్తున్న భూ సర్వేకు రైతులు సహకరించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలో సర్వే నిర్వహిస్తున్న పలు గ్రామాల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుబ్రహ్మణ్యంతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో రైతులతో ఆయన మాట్లాడుతూ, ఒక సర్వే నెంబర్ పూర్తయిన తరువాత మరో నెంబర్‌లో సర్వే ప్రారంభిస్తామన్నారు. సర్వేపై గ్రామాల్లో సమాచారం ఇస్తారని, అందుకు తగ్గట్లుగా రైతులు ఆ రోజున తమ భూముల వద్ద ఉండాలని సూచించారు. సర్వే అనంతరం అర్హులైన రైతుల వివరాలను గ్రామాల్లో నోటీస్ బోర్డులో ఉంచుతామన్నారు. అదేవిధంగా గ్రామాల్లోనే మీ-సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో పొందుపరిచి అర్హులైన వారికి పట్టాదారు పాస్‌పుస్తకాలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా నెల్లికల్లులో సర్వే నెం.299, 108,తునికినూతలలో సర్వే నెం.45, తిమ్మాయిపాలెంలో ఫారెస్ట్, రెవెన్యూ సరిహద్దుల్లో సర్వేను పరిశీలించారు. చింతలపాలెం రెవెన్యూ గ్రామానికి సబంధించి సర్వే నెం.152, 168లలో భూ సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

గుర్రంపోడు, ఆగస్టు 13: నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలోని ఆమలూరు గ్రామంలో మంగళవారం వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొండా రామచంద్రం (43) ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. రామచంద్రంకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మహిళపై దాడి .. నిందితులపై హత్యాయత్నం కేసు

చిలుకూరు, ఆగస్టు 13: సూర్యాపేట జిల్లా చిలుకూరు మండలంలోని ఆర్లెగూడెం గ్రామంలో మహిళపై మంగళవారం కత్తితో దాడి చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన దొంగరి సంధ్య తన తల్లిగారి గ్రామమైన ఆర్లెగూడేనికి వచ్చింది. కుటుంబ కలహాల నేపథ్యంలో గ్రామానికి చెందిన ఆరె.సైదాబాబు సంధ్యను వెనుక నుంచి వచ్చి కత్తితో దాడిచేశాడు. దీంతో చుట్టుపక్కల వారు ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సంధ్య తండ్రి ఆరె బసవయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సైదాబాబుపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంబాబు తెలిపారు.

కుక్కల దాడిలో ఐదు గొర్రెల మృతి

శాలిగౌరారం, ఆగస్టు 13: కుక్కల దాడిలో ఐదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఇటుకుల పహాడ్ గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. ఇటుకలపహాడ్ గ్రామానికి చెందిన మేకల కాపరి గోళ్ల సైదులు సోమవారం రాత్రి గొర్రెలను మందలో తోలాడు. అయితే అర్ధరాత్రి వేళ కుక్కల దాడిలో ఐదు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.50వేల విలువైన గొర్రెలు మృతి చెందాయని బాధితుడు సైదులు తెలిపారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

రామన్నపేట, ఆగస్టు 13: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో నిషేధిత గుట్కా ప్యాకెట్లను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. నార్కట్‌పల్లి మండలం బ్రాహ్మణవెల్లంల గ్రామానికి చెందిన బిజ్జాల రాంబాబు తన కారులో రూ.10వేల విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లను తరలిస్తుండగా వాహన తనిఖీల్లో పట్టుబడినట్లు ఎస్ఐ పి. మల్లయ్య తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రాష్ట్ర అభివృద్ధికి ఎన్ఆర్ఐల సహకారం


అమెరికాలో సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న తిరుమల్‌రెడ్డి

దేవరకొండ, ఆగస్టు 13: తెలంగాణ అభివృద్ధికి పూర్తిస్థాయిలో సహాయ, సహకారాలు అందిస్తామని నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం కొండభీమనపల్లికి చెందిన ఎన్ఆర్ఐ, వ్యాపారవేత్త మునుకుంట్ల తిరుపతిరెడ్డి అన్నారు. అమెరికాలో వ్యాపారవేత్తగా కొనసాగుతున్న మునుకుంట్ల తిరుమల్‌రెడ్డి అమెరికా పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం స్వాగతం పలికారు. అనంతరం ఆయన సీఎంతో మాట్లాడినట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి ఎన్ఆర్ఐల తరఫున సంపూర్ణ సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. దేవరకొండ నియోజకవర్గంలోని ప్రాజెక్టులు పూర్తిచేసి నిధులు కేటాయించాలని, అందుకుగాను ఎన్ఆర్ఐలు తమవంతు ఆర్థిక సహాయం చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వివరించినట్లు పేర్కొన్నారు. ఆయనవెంట రాష్ట్రానికి చెందిన ఎన్ఆర్ఐలు ఉన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

● ఏడుగురి నిందితుల అరెస్టు ● 31తులాల బంగారం, కిలో వెండి, రూ.28వేలు స్వాధీనం ● వివరాలు వెల్లడించిన ఎస్పీ శరత్ చంద్రపవార్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండ, ఆగస్టు 13: తాళం వేసిన ఇళ్లలో చోరీకి పాల్పడుతున్న అంతర్‌జిల్లా దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మంగళవారం నల్లగొండ జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ శరత్ చంద్ర పవార్ వివరాలు వెల్లడించారు. జిల్లాలో వరుస దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో పక్కా సమాచారం మేరకు ప్రత్యేక బృందాల సభ్యులు మంగళవారం ఉదయం 9గంటలకు అనిశెట్టిదుప్పలపల్లి ఎక్స్ రోడ్డులో వాహనాలు చేశారు. అదే సమయంలో మిర్యాలగూడ వైపు ద్విచక్రవాహనంపై వెళుతున్న ఇద్దరిని ఆపి విచారించారు. ఈ విచారణలో వారు పెద్దసూరారం గ్రామపరిధిలో జూలై 30వ తేదీన పగటిపూట ఓ ఇంటి తాళం పగులగొట్టి దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. వెంటనే వారిని మరింత విచారణ చేయడంతోపాటు స్కూటీని తనిఖీ చేయగా, చోరీ చేసిన బంగారు అభరణాలు, నేరాలకు ఉపయోగించే ఇనుపరాడ్డు లభ్యమయ్యాయి. ఆభరణాలను మిర్యాలగూడలో విక్రయించేందుకు వెళుతున్నట్లు ఇద్దరు నిందితులు తెలిపారు. పట్టుబడిన నేరస్తులు ఇచ్చిన సమాచారంమేరకు ముఠాలోని నలుగురి సభ్యులను చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామంలో, మరో నిందితుడిని వలిగొండలో అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నేరస్తులందరినీ విచారించగా, వారంతా ఒక ముఠాగా ఏర్పడి నల్లగొండ జిల్లాతోపాటు రాచకొండ కమిషనరేట్ పరిధిలో మొత్తం 12నేరాలు చేసినట్లు ఒప్పుకున్నారు. ఈ నేరాల్లో మొత్తం రూ.23.53లక్షల విలువైన 31తులాల బంగారం, కిలో వెండి ఆభరణాలు, రూ.28వేల నగదుతోపాటు నేరాలకు ఉపయోగించిన స్కూటీ, ఇనుపరాడ్డును, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నిందితుల్లో చిట్యాల మండలం పెద్దకాపర్తికి చెందిన గుండెబోయిన మహేష్, అదే గ్రామానికి చెందిన గుండెబోయిన మల్లేష్‌తోపాటు నూతి సతీష్, యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండకు చెందిన బొడిగ అశోక్, చిట్యాల మండలం పెద్దకాపర్తికి చెందిన బైరబోయిన స్వామి, అదే గ్రామానికి చెందిన గుండెబోయిన చంద్రం, బడే బాలకృష్ణ ఉన్నారు. దొంగల ముఠాలో మరొక సభ్యుడు పరారీలో ఉన్నాడు. పట్టుబడిన నిందితుల్లో ఒకరు మినహా మిగతా వారంతా నల్లగొండ జిల్లా చిట్యాల మండలం పెద్ద కాపర్తి గ్రామానికి చెందిన వారన్నారు. వీరిలో గుండెబోయిన మహేష్, గుండెబోయిన మల్లేష్ మినహా మిగతా వారు పాత నేరస్తులని, వీరిపై గతంలో నల్లగొండ, జనగామ, రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్లలో చోరీ కేసులు నమోదయ్యాయి. ముఠా సభ్యులను పట్టుకోవడం కీలకంగా వ్యవహరించిన నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎం.జితేందర్ రెడ్డి, శాలిగౌరారం ఇన్‌స్పెక్టర్ కొండల్‌రెడ్డి, తిప్పర్తి ఎస్ఐ డి.రాజు, సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ విష్ణువర్ధన్ గిరి, లింగారెడ్డి, వహీద్‌పాషా, రాము, శ్రీనివాస్‌లను ఎస్పీ అభినందించారు.

ధర్మకర్తల మండలి ఏర్పాటుకోసం
దరఖాస్తుల ఆహ్వానం

● వచ్చే నెల 5వ తేదీలోపు అందజేయాలి

నల్లగొండ కల్చరల్, ఆగస్టు 13: జిల్లాలోని పలు దేవాలయాల్లో నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటుకోసం సెప్టెంబరు 5వ తేదీ వరకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా దేవాదాయ శాఖ ఏసీ అన్నెపర్తి సులోచన తెలిపారు. మంగళవారం ఆమె జిల్లా కేంద్రంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. నల్లగొండలోని తులసీనగర్ భక్తాంజనేయ, శేర్‌బంగ్లా సంతోషిమాతా దేవాలయం, శ్రీనగర్ కాలనీ రేణుకా ఎల్లమ్మ దేవాలయం, పానగల్లు ఛాయాసోమేశ్వర స్వామి ఆలయం, మారేపల్లి వేంకటేశ్వరస్వామి దేవాలయం, గోపలాయపల్లి శ్రీవారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానం, చింతపల్లి మండలం మాదనపురం లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం, కట్టంగూరు మండలంలోని కురుమర్తి కోదండరామచంద్రస్వామి దేవాలయం, మాడ్గులపల్లి మండలం శ్రీవేణుగోణపాలస్వామి దేవస్థానం, కేతేపల్లి మండంల బండేపాలెం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం, అన్నెపర్తి గ్రామం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానకు సంబంధించి నూతన మండలి ఏర్పాటు కోసం అర్హులైన వారు దరఖాస్తు హైదరాబాద్ దేవాదాయ శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

భువనగిరిలో నకిలీ సర్టిఫికెట్ల తయారీ

● పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు
● హైదరాబాద్, పరిసర ప్రాంతాలకు అందజేత

భువనగిరి టౌన్, ఆగస్టు 13: నకిలీ సర్టిఫికెట్లు తయారుచేస్తూ హైదరాబాద్ పరిసర ప్రాంతాలకు అందజేసిన యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరికి చెందిన ఇద్దరు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. స్థానిక సమ్మద్ చౌరస్తాలో ఏ టూ జెడ్ కమ్యూనికేషన్ పాయింట్ అన్‌లైన్ సెంటర్ నిర్వాహకుడైన అబ్దుల్లా అలియాస్ గణేష్‌ను, కార్తీక్ బుక్ బైండింగ్ వర్క్స్, రబ్బర్ స్టాంప్స్ నిర్వాహకుడైన మరికుక్కల గిరిని ఆదివారం రాత్రి ఎస్‌వోటీ పోలీసులు అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. ఎస్‌వోటీ పోలీసులు ఆ రాత్రంతా విచారించాక సోమవారం తెల్లవారుజామున భువనగిరి పట్టణ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు స్థానిక పోలీసులు సోమవారం అబ్దుల్లా, గిరి దుకాణాలు, ఇళ్లలో తనిఖీలు చేసి పేరు మార్పిడి పత్రాలు, హార్డ్‌డిస్క్‌లను స్వాధీనం చేసుకున్నారు. లభించిన వివరాల ఆధారంగా పోలీసులు విచారణ జరుపుతున్నారు. అయితే అబ్దుల్లా నకిలీపత్రాలను తయారు చేయగా, అందుకు అవసరమైన స్టాంపులను గిరి తయారుచేశాడని, ఈ ముఠాలో మరికొంతమంది నిందితులు కూడా ఉన్నట్లు ప్రచారమవుతోంది. వీరిద్దరినీ కోర్టులో హాజరుపరిచాక పూర్తి వివరాలను మీడియాకు తెలియజేస్తామని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. హైదరాబాద్‌తోపాటు పలు ప్రాంతాల వారికి ఈ ముఠా ఫేక్ సర్టిఫికెట్లను తయారు చేసి ఇచ్చినట్లు ప్రచారమవుతోంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

చౌటుప్పల్ రూరల్, కొండమల్లేపల్లి, ఆగస్టు 13: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో ఒకరు, నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో మరొకరు దుర్మరణం చెందారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట శివారు జాతీయరహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. సీఐ ఆశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా బొర్నకల్ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన దుడ్డ గురువయ్య(42) హైదరాబాద్ రహమత్‌నగర్‌లో కొబ్బరిబొండాల వ్యాపారం చేస్తుంటాడు. విజయవాడలో బంధువుల అంత్యక్రియలకు హాజరై తిరిగి డీసీఎంలో హైదరాబాద్ వస్తుండగా ముందుగా వెళ్తున్న లారీని డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో గురువయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని చిన్నఅడిశర్లపల్లి సమీపంలో కారు ఢీకొని ఒకరు మృతి చెందారు. స్థానికుల వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రాజ్ కుమార్(38) మండలకేంద్రంలో ఉంటూ తాపిమేస్త్రిగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో జడ్చర్ల-కోదాడ హైవేపై చిన్నఅడిశర్లపల్లి సమీపంలోని ఓ దాబా వద్ద భోజనం చేసి రోడ్డుదాటుతుండగా రమావత్ భిక్షనాయక్ అనే వ్యక్తి కారును అతివేగంగా నడిపి రాజ్‌కుమార్‌ను ఢీకొట్టాడు. దీంతో తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు.

అవయవదానంతో నలుగురి జీవితాల్లో వెలుగు

● బ్రెయిన్‌డెడ్ అయిన వ్యక్తి అవయవాలు దానం ● యాదాద్రి భువనగిరి జిల్లా తుమ్మలగూడెంలో ఆటో డ్రైవర్ కుటుంబం దాతృత్వం


రాస అశోక్(ఫైల్)

రామన్నపేట, ఆగస్టు 13: ఓ ఆటోడ్రైవర్ తాను మృతి చెంది, అవయవ దానంతో నలుగురు జీవితాల్లో వెలుగు నింపాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం తుమ్మలగూడెం గ్రామానికి చెందిన రాస అశోక్(39) ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 11వ తేదీన తన బావమరుదులతో కలిసి సిద్దిపేటకు డీజే బాక్సుల కోసం వెళ్లి, వాటిని కొనుగోలు చేసి టాటా ఏస్ వాహనంలో తీసుకొస్తుండగా, గజ్వేల్ సమీపంలో స్పీడ్ బ్రేకర్ రావడంతో డ్రైవర్ బ్రేక్ వేశాడు. వాహనం వెనుక భాగంలో కూర్చున్న అశోక్, ఇద్దరు బావమరుదులు ఒక్కసారిగా కిందపడ్డారు. ఇద్దరికీ స్వల్ప గాయాలు కాగా, రాస అశోక్ తల వెనుక భాగంలో తీవ్ర గాయమైంది. దీంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని యశోద ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో అశోక్ భార్య లలిత, యశోద ఆస్పత్రి ద్వారా అశోక్ నేత్రాలు, కాలేయం, కిడ్నీలు, గుండెను దానం చేశారు. ఇంటిపెద్ద మృతి చెందినా ఆయన అవయవాలు దానం చేసి నలుగురి జీవితాల్లో వెలుగులు నింపటంతో కుటుంబ సభ్యులను గ్రామస్థులు అభినందించారు. అశోక్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. స్వగ్రామం తుమ్మలగూడెంలో మంగళవారం అశోక్ అంత్యక్రియలు నిర్వహించారు. అశోక్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కాంగ్రెస్ జిల్లానేత పూస బాలకిషన్ కోరారు.

నేటి నుంచి యాదగిరీశుడి పవిత్రోత్సవాలు

● మూడు రోజులపాటు కొనసాగనున్న వేడుకలు ● ఏర్పాట్లు చేసిన దేవస్థాన అధికారులు ● రేపు, ఎల్లుండి నిత్య కల్యాణం, సుదర్శనహోమం రద్దు


నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, ఆగస్టు 13: యాదగిరీశుడి సన్నిధిలో బుధవారం నుంచి పవిత్రోత్సవాలు నిర్వహించనున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్ రావు తెలిపారు. ఆలయంలో ప్రతిరోజూ నిర్వహించే పూజల్లో దొర్లిన దోషాల నివారణకు వైష్ణవ, శైవ ఆలయాల్లో పవిత్రోత్సవాలు జరపడం సంప్రదాయమని ఆలయ ప్రధానార్చకుడు కాందూరి వెంకటాచార్యులు చెప్పారు. మూడు రోజులపాటుసాగే ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 14వ తేదీ మొదటి రోజు ఉదయం ప్రతిష్ఠామూర్తులకు విశేష అభిషేకం, సాయంత్రం స్వస్తివాచనం, అంకురార్పణ, రక్షాబంధనం, 15న రెండోరోజు అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర అధివాసం, మూలమంత్ర హోమాలు, నిత్య పూర్ణాహుతి, సాయంత్రం సుదర్శన చక్రానికి ఆరాధన, ఆవాహన చేసి అభిషేకించి పూలమాల (ఇది ఏటా ఒకరోజే) వేస్తారు. మూడో రోజైన 16వ తేదీన స్వామివారికి మహాపూర్ణాహుతి, పవిత్ర సమర్పణ, మహాకుంభప్రోక్షణ, మహదాశీర్వచనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ పవిత్రోత్సవాలు పాత గుట్ట ఆలయంలో కొనసాగుతాయన్నారు. పవిత్రోత్సవాల సందర్భంగా 15, 16 తేదీల్లో రెండు రోజుల పాటు నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహ్మోత్సవం, లక్ష పుష్పార్చన, సుదర్శనహోమం రద్దు చేసినట్లు ఈవో తెలిపారు.

లక్ష్మీనృసింహుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు అంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్య పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలను పాంచరాత్రాగమశాస్త్రరీతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 13,78,242 ఆదాయం సమకూరింది.

చెర్వుగట్టు హుండీ ఆదాయం రూ.36,59,950

నార్కట్‌పల్లి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవ క్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించుకున్న నగదు 60 రోజులకు మొత్తం రూ.36,59,950 వచ్చినట్లు ఈవో సిరికొండ నవీన్ కుమార్ తెలిపారు. గుట్టపైన ప్రధానాలయంతోపాటు ఉపాలయాల వద్ద ఉన్న హుండీలను లెక్కించగా రూ.32,08,490 రాగా, గుట్ట కింద పార్వతీ అమ్మవారి ఆలయంలోని హుండీల ఆదాయాన్ని లెక్కించగా రూ.4,51,460 కలిపి మొత్తం రూ.36,59,950 సమకూరినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్ డివిజన్ పర్యవేక్షకురాలు బీ.సుమతి తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న కేంద్ర మంత్రి


కేంద్రమంత్రికి తీర్థం అందజేస్తున్న అర్చకుడు

చిట్యాలరూరల్: నల్లగొండ జిల్లా చిట్యాల మండలం వెలిమినేడు శివారులో ఆంజనేయస్వామి దేవాలయంలో కొలువైన స్వామిని కేంద్ర భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మంగళవారం దర్శించుకున్నారు. పూరోహితులు వల్లూరి నిఖిల్ శర్మ, వల్లూరి భానుప్రకాష్‌శర్మ, ఆలయ ఈవో నవీన్‌కుమార్ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో మల్లారెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

ఏఎమ్మార్పీ నుంచి సాగునీటిని విడుదల చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, నాయకులు

నల్లగొండ, ఆగస్టు 13: ఏఎమ్మార్పీ నుంచి నల్లగొండ నియోజకవర్గంలోని కనగల్, తిప్పర్తి, నల్లగొండ, మాడ్గులపల్లి మండలాలకు డీ-25, డీ-37, డీ-39, డీ-40 కాల్వల ద్వారా సాగునీటిని విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ నారాయణ రెడ్డికి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాలుగేళ్లుగా ఏఎమ్మార్పీ కాల్వ ద్వారా నియోజకవర్గంలో సాగునీరు అందక పంటలు ఎండి రైతులు నష్టపోయారన్నారు. సాగర్ నుంచి ప్రస్తుతం పెద్దసంఖ్యలో నీరు సముద్రం పాలవుతుందని, అయినప్పటికీ ఏఎమ్మార్పీ కాల్వ ద్వారా నీరు అందించడం లేదన్నారు. తక్షణమే కాల్వలకు నీటిని విడుదల చేయకపోతే దశల వారీగా ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాయకులు బక్క పిచ్చయ్య, కరీంపాషా, కొండూరి సత్యనారాయణ, జమాల్ ఖాద్రీ, దోటి శ్రీనివాస్, భువనగిరి దేవేందర్, దేప వెంకట్ రెడ్డి, అయితగోని యాదయ్య, మెరుగు గోపి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా సిరిప్రగడ శ్రీనివాసశర్మ



శ్రీనివాస్‌శర్మ

నల్లగొండ టౌన్, ఆగస్టు 13: తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(బీఎస్ఎస్) జిల్లా అధ్యక్షుడిగా నల్లగొండ పట్టణానికి చెందిన సిరిప్రగడ శ్రీనివాస్‌శర్మ, ప్రధానకార్యదర్శిగా వేదాంతం కృష్ణచరణ్‌చార్యులు ఎన్నికయ్యారు. మంగళవారం జరిగిన సంఘ సమావేశంలో నూతనకమిటీని ఎన్నుకున్నారు.ఉపాధ్యక్షులుగా పసునూరి రాంబాబు, సిరిప్రగడ ఆనందరావు, గాదె గిరిధర్‌రావు, సహాయ కార్యదర్శులుగా కంజర్ యశ్వంత్ చార్యులు, కోశాధికారిగా కలాహలం సంజయుచార్యులు, ప్రచారకార్యదర్శి రంగరాజు జగదీష్, కార్యవర్గ సభ్యులు మారేపల్లి వెంకటాచార్యులు, గాదె మురళి కృష్ణ, మడపు సంతోష్‌లను ఎన్నుకున్నారు.

అవంతీపురం ఎస్‌బీఐ శాఖను తరలించొద్దు

మిర్యాలగూడ/ మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 13: ఎస్‌బీఐ అవంతీపురం శాఖను మిర్యాలగూడ పట్టణానికి తరలించవద్దని ఆలగడప మాజీ సర్పంచ్, మట్టిమనుషుల వేదిక నాయకులు వేనేపల్లి పాండురంగారావు కోరారు. మంగళవారం ఆయన ఆలగడప గ్రామస్తులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ బ్యాంకులో ఎలక్ట్రానిక్ సిస్టమ్స్ పనిచేయడం లేదనే నెపంతో టౌన్‌కు తరలించే ప్రయత్నం చేయడం తగదన్నారు. మిర్యాలగూడ వ్యవసాయ మార్కెట్‌ను అవంతీపురం ప్రాంతానికి మార్చిన నేపథ్యంలో బ్రాంచ్‌ను మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేశారన్నారు. సమీప గ్రామాల ప్రజలకు ఈ శాఖ ద్వారా బ్యాంకు సేవలు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో రైతులు తుమ్మల సత్యనారాయణ చౌదరి, ఇంద్రపల్లి బుచ్చిబాబు, గోవిందరెడ్డి, రంజాన్, సైదులు, నర్సయ్య, సునీల్ పాల్గొన్నారు.

మా కుటుంబాలకు మమ్మల్ని దగ్గర చేయండి



ప్లకార్డులు, నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు

పెద్దఅడిశర్లపల్లి / డిండి, ఆగస్టు 13: సీఎం సార్ మా కుటుంబాలకు మమ్మల్ని దగ్గర చేయడంటూ ఉపాధ్యాయులు సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మోడల్ స్కూల్ టీచర్లకు బదిలీలు, పదోన్నతులు ఇవ్వాలని కోరుతూ మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ 11 ఏళ్లుగా బదిలీలు లేక కుటుంబాలకు దూరంగా ఉంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్. వెంకటయ్య, పాండురంగయ్య, హుస్సేన్, రజిత, డీ కృష్ణయ్య, సైదానాయక్, సౌజన్య, రవికాంత్, పీడీ మల్లయ్య, పాల్గొన్నారు. డిండి ఆదర్శ పాఠశాలలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చిత్తలూరి సత్యనారాయణ, జిలానీ, రఘునందన్, శ్రీనివాసచారి, జయంతి, పల్లవి, అనిత, వినుత, జ్యోతి, విజయ పాల్గొన్నారు.

మహిళల్లో విస్తరిస్తున్న రొమ్ము, గర్భాశయక్యాన్సర్



వర్క్‌షాపులో మాట్లాడుతున్న ఐఎంఏ అధ్యక్షురాలు డాక్టర్ జీవనజ్యోతి

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 13 : మహిళల్లో రొమ్ము, గర్భాశయక్యాన్సర్ వ్యాధి ప్రమాదకర స్థాయిలో విస్తరిస్తోందని మిర్యాలగూడ ఐఎంఏ అధ్యక్షురాలు, ప్రముఖ గైనిక్ డాక్టర్ జీవనజ్యోతి అన్నారు. పట్టణంలో ఐఎంఏ భవనంలో ఇండియన్ సొసైటీ ఆఫ్ కాల్పోస్కోపీ అండ్ క్లినికల్ పథాలజీ(ఐఎస్‌సీసీపీ)అనుబంధ జిల్లా గైనకాలజీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఏటా 1.22 లక్షల మంది మహిళలు గర్భాశయ, రొమ్ముక్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నట్లు తెలిపారు. రోగుల్లో ఏటా 62వేల మంది వ్యాధితీవ్రతను తట్టుకోలేక మృత్యువాతపడుతున్న తీరు వైద్యరంగాన్ని ఆందోళన కలిగిస్తోందన్నారు. స్క్రీనింగ్ పరీక్షద్వారా గర్భాశయంలో వచ్చే జబ్బులను ముందుగానే కనిపెట్టవచ్చన్నారు. కార్యక్రమంలో స్త్రీవ్యాధి వైద్య నిపుణుల సంఘం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ మంజుల, కార్యదర్శి డాక్టర్ రాజేశ్వరిప్రవీన్, ఐఎస్‌సీసీపీ అధ్యక్షురాలు డాక్టర్ లీల, కామినేని మెడికల్ కాలేజీ హెచ్‌వోడీ డాక్టర్ ప్రసన్న, వైద్యబృందం లత, జ్యోతి, అమూల్య తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో మైనార్టీలపై దాడులు అరికట్టాలి



కాగడాలతో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రతినిధులు

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 13: బంగ్లాదేశ్‌లో హిందువులు సహా మైనార్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని హిందూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. దాడులను వ్యతిరేకిస్తూ హిందూ సంఘాల ఐక్యవేదిక, ఆర్యసమాజ మందిరం ఆధ్వర్యంలో పట్టణంలో కాగడాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల స్థూపం వద్ద బంగ్లా మృతులకు నివాళులర్పించారు. అనంతరం రాజీవ్ చౌక్‌వరకూ శాంతి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు గుండా ప్రసాద్, గంజి సుధాకర్, గుంటూరు రవి, ప్రవీణ్, శ్రీనివాస్, విజయానంద్, నాగేశ్వరరావు, సత్యనారాయణ, నక్క రవి, పద్మ, లక్ష్మి, లక్ష్మణ్, రమేష్, చారి తదితరులు పాల్గొన్నారు.

యువతలో దేశభక్తిని పెంపొందించడమే లక్ష్యం





హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా మిర్యాలగూడ, హాలియా పట్టణాల్లో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు, దేవరకొండలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

నల్లగొండ, ఆగస్టు 13: నిరంతరం యువతలో దేశభక్తిని పెంపొందించడంతో పాటు దేశ పునర్నిర్మాణంలో భారతీయ జనతా యువమోర్చా ముందుంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం యువమోర్చా ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా అభియాన్ కార్యక్రమంలో భాగంగా నల్లగొండ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని హర్‌ఘర్ తిరంగాను పటిష్టంగా చేపట్టామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, పార్లమెంట్ కోకన్వీనర్ పిల్లి రామరాజుయాదవ్, రాష్ట్ర నాయకులు పోతేపాక సాంబయ్య, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంగూరి రాఖీ, రేవల్లి కిరణ్‌కుమార్, పోతేపాక లింగస్వామి, కంచర్ల విద్యాసాగర్ రెడ్డి, పాశం శ్రీనివాస్, పెరిక ముని, శ్రీనివాస్, కనకయ్య, లోహిత్‌రెడ్డి, గోపి, సాయి, గోపిరెడ్డి, నరేష్, రాఘవ పాల్గొన్నారు.

హాలియా : పట్టణంలోని రామాలయం నుంచి బస్టాండ్ వరకు హర్‌ఘర్ తిరంగా అభియాన్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నాగార్జునసాగర్ నియోజవర్గ అసెంబ్లీ కన్వీనర్ కడియం సైదులు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ చెన్ను వెంకట్‌నారాయణరెడ్డి, ఓబీసీ మోర్చా నాయకులు మెండే అనిల్‌కుమార్‌యాదవ్, భాస్కర్‌నాయక్, బాలాజీనాయక్, అంజినాయక్, ధనుంజయ్, మేదరి సైదులు, రాజేష్‌నాయక్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడలో రెండు వేల మంది విద్యార్థులు, యువకులు జాతీయజెండాలతో పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఫ్లైఓవర్ నుంచి రాజీవ్‌చౌక్ వరకూ నిర్వహించిన ర్యాలీలో ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు సాదినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ పంద్రాగస్టు సందర్భంగా ప్రతి ఇంటిపై త్రివర్ణ జెండా ఎగరేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, ఎడ్ల రమేష్, పురుషోత్తంరెడ్డి, సరిత, రమాదేవి, శ్యాం, సైదులు పాల్గొన్నారు.

దేవరకొండ: బీజేపీ పట్టణశాఖ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకూరి నర్సింహ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండాల అంజయ్యయాదవ్, కర్నాటి సురేష్, నేతాళ్ల వెంకటేష్, పబ్బు సైదులు, సుధాకర్, మల్లేష్‌నాయక్, భాస్కర్, శంకర్ పాల్గొన్నారు.

చిట్యాల: బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో మహనీయుల విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మోర్చా రాష్ట్ర కార్యదర్శి మాస శ్రీనివాస్, కే లింగస్వామి, నర్సింహ, అశోక్, గోవర్ధన్, నరేష్ పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలి



తిరుమలగిరి(సాగర్)లో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఐ

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 13 : విద్యార్థులు, యువత సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలని ఎస్ఐ బీ శ్రీనునాయక్ అన్నారు. 'మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్పరిణామాలపై మంగళవారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, మండల నోడల్‌అధికారి శ్రీనివాస్, పోలీస్ సిబ్బంది సీహెచ్.శ్రీను, అంజినాయక్, పాల్గొన్నారు.

వేములపల్లి : గంజాయి మొక్కలను సాగు చేయడం నేరమని ఏడీఏ నాగమణి అన్నారు. స్థానిక రైతువేదికలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఏవో రుషేంద్రమణి, ఏఈవోలు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ : గంజాయి సాగు నిర్మూలనపై స్థానిక రైతు వేదికలో ఏడీఏ శాంతి నిర్మల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నాగేష్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: మండలంలోని ఉరుమడ్ల రైతువేదికలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పగిడిమర్రి గిరిబాబు, హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ, కోనేటి యాదగిరి, పల్లపు బుద్దుడు, చెరుకు సైదులు, పట్ల జనార్దన్, శ్రీను, శ్రీను, యాదయ్య పాల్గొన్నారు.

కేతేపల్లి : మాదకద్రవ్యాల నిర్మూలనకు అందరూ సహకరించాలని తహసీల్దార్, ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, శివతేజ కోరారు. కేతేపల్లి రైతువేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. అనంతరం రైతులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో పురుషోత్తం, ఎంపీవో నాగలక్ష్మి, ఏఈవోలు పాల్గొన్నారు.

చింతపల్లి: మండలకేంద్రంలోని రైతువేదికలో సాగు, గంజాయి నిర్మూలన అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో శ్రవణకుమారి, ఏఎస్ చంద్రారెడ్డి, ఏఈవో నరసింహ, మధు, అరుణ, మాధురి, శ్రీలత, మౌనిక పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



రైస్‌మిల్లర్స్‌తో కలిసి మొక్కలను నాటుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

వేములపల్లి, ఆగస్టు 13 : ప్రతి ఒక్కరూ మొక్కలను విరివిగా నాటి కాలుష్య నివారణకు కృషి చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని శెట్టిపాలెం గ్రామశివారులోని మహాతేజ రైస్‌మిల్లులో ఆయన మొక్కలను నాటి మాట్లాడారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మిర్యాలగూడ ప్రాంతంలో కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రతి రైస్‌మిల్ 250 మొక్కల చొప్పున నాటాలన్నారు. కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కర్నాటి రమేష్, మహాతేజ రైస్‌మిల్ అధినేత బండారు కుశలయ్య ఉన్నారు.

పండుగలు ఐకమత్యాన్ని పెంచుతాయి



ఎడ్లబండ్లపైన వెళ్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి

శాలిగౌరారం, ఆగస్టు 13 : పండుగలు సంప్రదాయంతో పాటు ఐకమత్యాన్ని పెంపొందిస్తాయని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిత్తలూరు గ్రామంలో నిర్వహించిన మహంకాళి అమ్మవారి బోనాల మహోత్సవాలకు ఆయన హాజరయ్యారు. ఎడ్లబండ్లు, ట్రాక్టర్లపై గ్రామస్తులతో కలిసి తిరిగారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు నూక కిరణ్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, సీనియర్ నాయకులు పాదూరి శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బొమ్మగాని రవి, మాజీ జడ్పీటీసీ ఎర్ర రణీలయాదగిరి, గిరిగాని వీరేందర్, బండపెల్లి కొమరయ్య, శ్రీధర్, బండమీది రమేష్, నోముల జనార్ధన్, సుల్తాన్, ఎల్లయ్య, ఎర్ర కృష్ణ, మోహన్, చింత, ధనుంజయ్, గ్రామ పెద్దలు, స్థానిక కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

మిర్యాలగూడ, ఆగస్టు 13 : ఆర్డీవో ఆదేశంతో నిలిచిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ కోటిరెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. ఈ నెల 6న ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు సీఎంఆర్ఎస్ చెక్కులను పంపిణీ చేయాలని భావించారు. ఈ మేరకు లబ్ధిదారులను సోషల్‌మీడియా వేదికగా ఆహ్వానించారు. కాగా ప్రభుత్వ చెక్కులను పార్టీ కార్యాలయంలో పంపిణీ చేయడానికి వీలులేదని, ఎమ్మెల్సీ కార్యాలయంలో కాని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేయవచ్చునని ఆర్డీవో ఆదేశించారు. దీంతో చెక్కుల పంపిణీ నిలిపివేశారు. మంగళవారం ఎమ్మెల్సీ కార్యాలయంలో 41 మందికి రూ.14,40, 500 విలువగల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ సర్పంచ్‌లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

కట్టంగూరు : కట్టంగూరులో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మాజీ జడ్పీటీసీ మాద యాదగిరి అందజేశారు. కార్యక్రమంలో మిట్టపల్లి శివశంకర్, అంజన్‌కుమార్, మర్రి రాజు, రెడ్డిపల్లి స్వామి, రామకృష్ణ, అయితగోని సైదులు, శ్రీకాంత్ ఉన్నారు.

కనగల్ : మండలంలోని తేలకంటిగూడెం, మార్తినేనిగూడెం గ్రామస్తులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మాజీ సర్పంచ్ బోగరి రాంబాబు, కుంటిగొర్ల కృష్ణ పంపిణీచేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సైదులు, నామ శ్రీనివాస్, సురేష్, యాదయ్య పాల్గొన్నారు.

మిడ్‌డే మిల్స్‌ను స్వచ్ఛంద సంస్థలకు అప్పగించొద్దు

కట్టంగూరు / నల్లగొండ రూరల్/హాలియా, ఆగస్టు 13 : మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అప్పగించ వద్దని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం కట్టంగూరులో ఎంఈవో ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు కంకణాల శోభరాణి, మాచర్ల యాదమ్మ, కొప్పు మంగమ్మ, కళమ్మ, పార్వతమ్మ, సైదమ్మ, వెంకటమ్మ, సునిత, పార్వతమ్మ, సరిత పాల్గొన్నారు. అదేవిధంగా నల్లగొండ ఎంఈవో కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, అల్లి అనురాధ, దొడ్డి అండాలు మహేశ్వరి, వెంకటమ్మ, దండెంపల్లి పార్వతమ్మ, దేబోరా, పుష్పలత, ముత్యాలు, అలివేలు తదితరులు పాల్గొన్నారు. హాలియాలో జరిగిన ధర్నాలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అవుతా సైదులు, కార్మికులు పాల్గొన్నారు.

ఫెలోషిప్‌కు ఎంపికైన రామ్‌చందర్

నల్లగొండ, ఆగస్టు 13 : భువనేశ్వర్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లో సీనియర్ సైంటిస్ట్‌గా 18 ఏళ్ల నుంచి పని చేస్తున్న డాక్టర్ రాంచందర్ హైదరాబాద్‌లోని తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్(టాస్)లో ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఉప్పల్ ఎంజీఆర్ఐలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో సంస్థ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్‌కుమార్ ఫెలోషిప్ పత్రాన్ని రామ్‌చందర్‌కు అందజేశారు. వినికిడి లోపానికి కారణమైన జన్యుపరమైన అంశాలు అర్థ చేసుకొని తిరిగి వాటిని సవరించే పరిశోధనకు, అరుదైన రుగ్మతలకు కారణమైన జన్యుశాస్త్ర రంగాలకు ఆయన సాధించిన విజయాలకు గుర్తింపుగా ఫెలోషిప్‌ను అందజేశారు. డాక్టర్ రాంచందర్ నల్లగొండ ఎన్‌జీ కళాశాలలో డిగ్రీ, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు.

శ్రీమంగళగౌరీదేవిగా రేణుకాఎల్లమ్మ



కనగల్, ఆగస్టు 13 : మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద ఉన్న శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు శ్రావణమాసం పురస్కరించుకుని శ్రీమంగళగౌరీదేవి అలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఈవో జయరామయ్య ఏర్పాట్లు చేశారు.

పంచాయతీ రికార్డుల తనిఖీ

మునుగోడు, ఆగస్టు 13 : మునుగోడు మేజర్ గ్రామపంచాయతీ రికార్డులను డీఎల్పీవో వెంకటేశ్వర్లు మంగళవారం తనిఖీచేశారు. గతంలో ఇంటి నిర్మాణం అనుమతులపై ఆన్‌లైన్ పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలపై ప్రత్యేకంగా ఆరా తీశారు. పలువురి నుంచి ఆధారాలతో వివరాలను సేకరించారు. ఆయన వెంట వెంట ప్రస్తుత కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

డిండి, ఆగస్టు 13 : డిండి మండలకేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ వీరవల్లి రాధాకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డ్రాఫ్ట్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, స్టోనోగ్రఫీ, వెల్డర్, ట్రేడర్‌లలో మూడో విడత సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. అర్హులైన వారు ఈ నెల 17వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మంత్రి ప్రభాకర్‌ను కలిసిన నాయకులు



మంత్రి ప్రభాకర్‌ను వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

మర్రిగూడ, ఆగస్టు 13 : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌కు నాంపల్లి మండల నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవరకొండ నుంచి నాంపల్లి, మర్రిగూడ, నారాయణపురం మీదుగా యాదగిరిగుట్టకు గతంలో ఉన్న బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని మంత్రిని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కత్తి రవీందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏవిరెడ్డి, జిల్లా నాయకులు ఏరెడ్ల రఘుపతిరెడ్డి, పూల వెంకటయ్య, పెద్దిరెడ్డి, సంజీవరెడ్డి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఫౌండేషన్ నిర్వాహకులు

దేవరకొండ, ఆగస్టు 13: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని అందుకు కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందిస్తామని ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి చరణ్ అన్నారు. మంగళవారం మండలంలోని కొమ్మెపల్లి ప్రాథమిక పాఠశాలలో కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్‌పుస్తకాలు, స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసి, మాట్లాడారు. కార్యక్రమంలో బీసీ పొలిటికల్ యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చింతపల్లి సతీష్‌గౌడ్, తోటపల్లి మల్లేష్, హెచ్‌ఎం ప్రేమయ్య, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నల్లగొండరూరల్: పట్టణంలోని దొడ్డి కొమురయ్య భవనంలో సీపీఎం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాలడుగు నాగార్జున, సీపీఎం మండల కార్యదర్శి నలపరాజు సైదులు, కుడతాల్ భూపాల్, అంజయ్య, వెంకన్న, రవీందర్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

నల్లగొండ రూరల్: మహిళా సమాఖ్యలోని అటెండర్స్‌కు రూ.18 వేలు వేతనాలు చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, యూనియన్ జిల్లా అధ్యక్షుడు పులకరం నారాయణ, ఉల్లెందుల సైదులు, తదితరులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ : స్థానిక ఫర్టిలైజర్ దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను ఏడీఏ శాంతి నిర్మల తనిఖీ చేశారు. పురుగుల మందులను పరిశీలించారు.

నిడమనూరు: మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో వైద్యశిబిరం కొనసాగుతోంది. జ్వరబాధితులకు మందులు అందజేశారు.ఇన్‌చార్జి ఎంపీడీవో బోనగిరి రమేష్, ఎంపీవో సకినాల పద్మ వైద్య శిబిరాన్ని సందర్శించారు.

నార్కట్‌పల్లి: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రముఖ మానసిక వైద్యనిపుణుడు విజయ్ పరీక్షలు, ఒత్తిడి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ ఇస్మాయిల్, అధ్యాపకులు నడింపల్లి వెంకటేశ్వర్లు, వెంకన్న, వీరమల్ల వెంకటేష్, తేజస్విని, సంతోశ్, సంజీవ్, అన్న, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: కేరళలోని వయనాడ్ బాధితుల కోసం సీపీఎం ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు.కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, జిట్ట సరోజ, అరూరి శ్రీను, బొబ్బల సుధాకర్‌రెడ్డి, రాములు, అరూరి నర్సింహ, ఏళ్ల మారయ్య పాల్గొన్నారు.

గట్టుప్పల్ : మండలంలోని వెల్మకన్నె గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బట్టపోతుల నరసింహకు నివాళులర్పించారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ జిల్లా నేత దెండే బీరప్ప, సీనియర్ జర్నలిస్టు బట్టపోతుల ప్రదీప్, పలుపార్టీల నాయకులు వనం వెంకన్న, బాల మహేష్, పడసగోని యాదయ్య, సైదులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్ : ఫెయిత్ బంజారా ఆశ్రమం ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు హన్యానాయక్, రమాబాయి, జనార్దన్, నాగయ్య పాల్గొన్నారు.

కనగల్ : మండలంలోని తేలకంటిగూడెం, కనగల్‌లోని పాఠశాల్లో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదును సంఘం నాయకులు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి నారాయణరెడ్డి, మండల, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జావీద్, సైదిరెడ్డి పాల్గొన్నారు.

కనగల్ : డీఆర్‌డీవో పీడీగా బాధ్యతలు చేపట్టిన శేఖర్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, మాజీ సర్పంచ్‌లు నల్లగొండలో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు గోలి నర్సిరెడ్డి, నర్సింగ్ సునీతాకృష్ణయ్యగౌడ్, బోగరి రాంబాబు, దేవ నరేందర్ రెడ్డి, గుండెబోయిన రమేష్‌యాదవ్, రమణారెడ్డి తదితరులున్నారు.

మాడ్గులపల్లి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల అమలులో విఫలమైందని సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ అధికారం చేపట్టాక హామీల అమలులో చిత్తశుద్ధి కనబడటం లేదన్నారు.

శాలిగౌరారం : శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య పరీక్షలకు హాజరైన గర్భిణులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సూర్య శిల్ప క్లబ్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో అన్నదాత ఆకవరం నవీన్ కుమార్-మల్లేశ్వరీ దంపతులు, క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాసులు, కోశాధికారి వడ్లకొండ బిక్షంగౌడ్, ప్రతినిధులు పాల్గొన్నారు.

చండూరు: పట్టణంలో పలు దుకాణాల్లో మునిసిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి తనిఖీ నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లను విక్రయించవద్దని సూచించారు. ఆయన వెంట మేనేజర్ అరుణకుమారి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ అరవింద్‌రెడ్డిసానిటరీ ఇన్‌స్పెక్టర్ సాయి ఉన్నారు.

మునుగోడు: ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తోందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొల్లూరి నర్సింహ అన్నారు. మునుగోడులో నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో చెడుబుద్ధి ఊషయ్య, మాజీ జడ్పీటీసీ లింగయ్య, సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పునూతల రమేష్, కాయితి వెంకన్న, ఇరిగి సంజీవ, సత్తయ్య, పెంటయ్య సైదయ్య పాల్గొన్నారు.

చింతపల్లి : ఓపెన్ స్కూల్‌లో ప్రవేశానికి ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని జడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం రమావత్ లక్ష్మి తెలిపారు. పాస్‌ఫోటోలు, పదో తరగతి టీసీ, మెమోను అందజేసి అడ్మిషన్ పొందే అవకాశం ఉందన్నారు.

కట్టంగూరు : మండలంలోని ఈదులూరులో సాయుధ పోరాటయోధుడు బూర్గు అంజన్న వర్ధంతి కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు ఇందూరి సాగర్, మాజీ సర్పంచ్ అయితగోని నారాయణ, బూర్గు సత్తయ్య, జానపాటి దేవయ్య, పోలే పవన్, గద్దపాటి పాపయ్య, యాదయ్య పాల్గొన్నారు.

గట్టుప్పల్: మండలకేంద్రంతో పాటు అంతంపేట వెల్మకన్నె గ్రామాల్లో వర్షం కురిసింది. పంటలకు సరైన సమయంలో వర్షం కురిసి జీవం పోసినట్లయిందని రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

కొండమల్లేపల్లి: మండలంలోని అంబోతుతండా, రామునిగుండ్లతండా, మేగ్యతండా, చింతచెట్టుతండాలలో ఎక్సైజ్ అధికారులు విస్తృత దాడులు నిర్వహించారు. దాడుల్లో ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకొని, సారా విక్రేత లలితను అరెస్ట్ చేసినట్లు దేవరకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. వెయ్యి లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామన్నారు.